# తరగతి - 8

## కవి పరిచయాలు

## 1. అమ్మకోసం

1. ఆదికవి, వాగనుశాసనుడని బిరుదులు పొందిన నన్నయ పదకొండో శతాబ్ది కవి. రాజమహేంద్రవరం రాజధానిగా ఆంధ్రదేశాన్ని పరిపాలించిన తూర్పుచాళుక్యరాజు రాజరాజనరేంద్రుని ఆస్థానంలోనివాడు. వ్యాసుడు సంస్కృతంలో రచించిన మహాభారతాన్ని ఆంధ్రీకరించిన కవిత్రయంలో మొదటివాడు నన్నయ. ఆంధ్రశబ్దచింతామణి అనే వ్యాకరణ గ్రంథం రచించిన తరువాత భారతంలో ఆది, సభాపర్వాలను, అరణ్యపర్వం 4వ ఆశ్వాసంలో 142 పద్యాల వరకు ఆంధ్రీకరించాడు. చాముండికా విలాసము, ఇంద్ర విజయము నన్నయ ఇతర రచనలు.



నన్నయ భట్టు (ఊహాచిత్రం)

అక్షరరమ్యత, ప్రసన్నకథా కలితార్థయుక్తి, నానారుచిరార్థ సూక్తినిధిత్వం నన్నయ కవిత్వంలోని ప్రధాన లక్షణాలు. అనువాద పద్ధతిలో, శైలిలో తరువాతి కవులకు మార్గదర్శకుడయ్యాడు నన్నయ.

## 4. నీతి పరిమళాలు

2.

| కవుల పేర్లు | కాలం | శతకం |
|---|---|---|
| మారద వెంకయ్య | 17వ శతాబ్ది | భాస్కర శతకం |
| మూలం - భర్తృహరి | 7వ శతాబ్ది | సుభాషిత త్రిశతి |
| అనువాదం - ఏనుగు లక్ష్మణ కవి | 18వ శతాబ్ది | సుభాషిత రత్నావళి |
| కంచెర్ల గోపన్న (రామదాసు) | 17వ శతాబ్ది | దాశరథి శతకం |
| మూలం - నీలకంఠ దీక్షితులు | 17వ శతాబ్ది | సభారంజన శతకం |
| అనువాదం - ఏలూరిపాటి అనంతరామయ్య | 20వ శతాబ్ది | |
| ధూర్జటి | 16వ శతాబ్ది | శ్రీకాళహస్తీశ్వర శతకం |
| తాళ్ళపాక పెద్ద తిరుమలాచార్యులు | 16వ శతాబ్ది | వేంకటేశ శతకం |
| కొండూరు వీర రాఘవాచార్యులు | 20వ శతాబ్ది | మిత్ర సాహస్రి |

## 5. ప్రతిజ్ఞ


శ్రీరంగం శ్రీనివాసరావు

3. శ్రీశ్రీగా ప్రసిద్ధి చెందిన శ్రీరంగం శ్రీనివాసరావు 1910వ సంవత్సరంలో విశాఖపట్నంలో జన్మించారు. పద్దెనిమిదేళ్ళ నాటికే "ప్రభవ" అనే భావకవితా సంపుటి వెలువరించారు. అభ్యుదయ కవితా సంపుటి 'మహాప్రస్థానం'తో మహాకవి అయ్యారు. విప్లవకవిగా ఖడ్గసృష్టి, మరో ప్రస్థానం గీతాలు రాశారు. మూడు యాభైలు పేరిట వ్యంగ్య కవితలు, కార్టూను కవితలు,1 + 1 = 1 లేక డిశంబరు 31, 1999 పేరిట రేడియోనాటికలు సంకలితం అయ్యాయి. 'చరమరాత్రి' కథల ద్వారా చైతన్య స్రవంతి పద్ధతిని తెలుగు రచనలో ప్రవేశపెట్టారు. 15-6-1983 నాడు తుది శ్వాస విడిచారు.

"మానవుడే నా సందేశం - మనుష్యుడే నా సంగీతం" అని ఎలుగెత్తి చాటిన యుగకర్త శ్రీశ్రీ. కష్టజీవికి కాపుదలగా కవిత్వం రాసిన కవి. శ్రీశ్రీ సృజనకు, ప్రతిభకు, తాత్త్విక మార్గాన్వేషణకు పేరుగన్నవాడు. నూతన పదప్రయోగాల మార్గదర్శకుడు. కర్షకులు, కార్మికులు, పీడితులు, పేదలు అనుభవించే కష్ట సుఖాలు ఈయన కవితావస్తువులు.

## 6. అజంతా చిత్రాలు


నార్ల వేంకటేశ్వరరావు

4. నార్ల వేంకటేశ్వరరావు 1908 డిసెంబర్ ఒకటవ తేదీన కృష్ణాజిల్లాలోని 'కవుతరం' అనే గ్రామంలో జన్మించారు. ఈయన రష్యన్ కథలు (అనువాద రచన), నరకంలో హరిశ్చంద్రుడు (నాటకం), నార్లవారి మాట (పద్యకావ్యం) మొదలైన గ్రంథాలు రచించారు. ఈయన పత్రికాసంపాదకుడు, కవి, విమర్శకుడు. నిరంతరం సమాజ శ్రేయస్సు కోసం కృషిచేసిన మేధావి. నార్లవారి రచన సరళమైన శబ్దాలతో, సొగసైన భావాలతో సుందరశైలిలో సాగుతుంది.

## 9. హరిశ్చంద్రుడు

5. ద్విపదకు పునర్జీవం పోసిన గౌరన 15వ శతాబ్దికి చెందినవాడు. ఈయన నల్గొండజిల్లా దేవరకొండ ప్రాంతం వాడు. హరిశ్చంద్రోపాఖ్యానం, నవనాథ చరిత్ర రచించాడు. సంస్కృతంలో 'లక్షణ దీపిక' అనే గ్రంథాన్ని రచించాడు. ఈయనకు 'ప్రతివాదగజ పంచాననుడు', 'చతురసాహిత్య లక్షణ చక్రవర్తి' అనే బిరుదులున్నాయి. ఈయన శైలి మనోహరమైనది. సామెతలు, జాతీయాలతో కవిత్వం అలరారుతుంది. అచ్చతెలుగు పలుకుబళ్ళు కవిత్వం నిండా రసగుళికల్లా జాలువారుతాయి. పద ప్రయోగాలలో నైపుణ్యం అడుగడుగునా కనపడుతుంది.

## 10. ప్రకృతి ఒడిలో...



6. **కవి** : కొడవటిగంటి కుటుంబరావు

**జననం, మరణం** : అక్టోబరు 28, 1909 – ఆగస్టు 17, 1980

**జన్మస్థలం** : తెనాలి, గుంటూరు జిల్లా.

**రచనలు** : జీవితం, చదువు అనే నవలలు, అద్దెకొంప, షావుకారు సుబ్బయ్య మొదలైన కథానికలు, సినిమా వ్యాసాలు, సైన్సు వ్యాసాలు, సంస్కృతి వ్యాసాలు, తాత్త్విక వ్యాసాలు మొ॥నవి.

## 11. జీవన భాష్యం

7. ఆచార్య సింగిరెడ్డి నారాయణరెడ్డి 1931లో కరీంనగర్ జిల్లా హనుమాజీపేట గ్రామంలో పుట్టారు. వీరు ప్రముఖ ఆధునిక కవి, వక్త, పరిశోధకులు, బహుభాషావేత్త, ప్రయోగశీలి.



**ఆచార్య సి. నారాయణ రెడ్డి**

నాగార్జున సాగరం, కర్పూర వసంతరాయలు, మధ్యతరగతి మందహాసం, విశ్వంభర, ప్రపంచ పదులు మొదలైన నలభైకి పైగా కావ్యాలు, అద్భుతమైన సినిమా పాటలు రాశారు. "ఆధునికాంధ్ర కవిత్వము – సంప్రదాయములు, ప్రయోగములు"

అన్న వీరి సిద్ధాంత గ్రంథము ఎన్నో ముద్రణలను పొందింది. వీరి 'విశ్వంభర' కావ్యానికి జాతీయ స్థాయిలో అత్యున్నత సాహితీ పురస్కారమైన 'జ్ఞానపీఠ అవార్డు' లభించింది. భారత ప్రభుత్వం వీరిని పద్మభూషణ్ బిరుదుతో గౌరవించింది. 'చమత్కారం' – వీరి కలానికీ, గళానికీ ఉన్న ప్రత్యేకత

## 13. సంస్కరణ

8. తెలుగు పాత్రికేయులలో సుప్రసిద్ధులైన నందూరి రామమోహన రావు (1927 - 2011) కృష్ణాజిల్లా విస్సన్నపేటలో జన్మించారు. జ్యోతి, ఆంధ్రజ్యోతి, బాలజ్యోతి, వనితాజ్యోతి మొదలైన పత్రికల్లో సంపాదకులుగా పనిచేశారు. విశ్వరూపం, నరావతారం, విశ్వదర్శనం వీరి ప్రముఖ రచనలు. నందూరి వారి సంపాదకీయ వ్యాసాలు అయిన "అనుపల్లవి", "చిరంజీవులు", "నందూరి రామమోహనరావు వ్యాఖ్యావళి" పేరిట సంకలనాలుగా వచ్చాయి. పిల్లలకోసం కొన్ని ఇంగ్లీషు నవలలను తెలుగులో రాశారు. అవి "చిలక చెప్పిన రహస్యం", "మయూరకన్య" "హరివిల్లు" పేరిట పిల్లల గేయాలు రాశారు.



**నందూరి రామమోహనరావు**

తెలుగు విశ్వవిద్యాలయం వీరికి గౌరవ డాక్టరేటు ఇచ్చి గౌరవించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తమ పాత్రికేయుడు అవార్డుతో సత్కరించింది.

## 14. సందేశం

9. ఈయన పూర్తిపేరు **సురగాలి తిమోతి జ్ఞానానందకవి.** బొబ్బిలి తాలుకా పెదపెంకి గ్రామంలో జన్మించారు. తెలుగు పండితులుగా పని చేశారు. ప్రాథమిక విద్యార్థి దశలోనే ఆశువుగా సీస పద్యాలు చెబుతూ 'దీనబంధు శతకాన్ని' రాశారు. ఆమ్రపాలి, పాంచజన్యం, క్రీస్తు శతకం, నా జీవిత గాథ, కూలీ నుండి కళాప్రపూర్ణ వరకు, పర్జన్యం, గోల్కొండ మొ॥నవి వీరి రచనలు. 1975లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డును పొందారు. రాష్ట్ర ప్రభుత్వంచే ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు. భారత ప్రభుత్వం పద్మశ్రీతో సత్కరించింది. సరళమైన శైలితో సామాజిక చైతన్యాన్ని అందించారు.



**డా॥ యస్.టి. జ్ఞానానందకవి**
**(1922 - 2011)**

# నేపథ్యాలు

## 1. అమ్మకోసం

**1.** కద్రువ, వినత కశ్యప ప్రజాపతి భార్యలు. పెద్దభార్య కద్రువకు కశ్యపుని వరం వల్ల వేయిమంది కుమారులు పుట్టారు. వారే కర్కోటకాది సర్పాలు. వినతకు అనూరుడు, గరుత్మంతుడు పుట్టారు. అనూరుడు, సూర్యుని రథసారథి. వినత ఒక పందెంలో ఓడిపోయి కద్రువకు దాసి అయింది. తల్లితోపాటు గరుత్మంతుడు కద్రువ కుమారులకు సేవలు చేస్తూ ఉండేవాడు.

మహాశక్తిమంతుడైన గరుత్మంతుడు తమ దాస్యానికి కారణం తెలుసుకోవడానికి తల్లి దగ్గరకు వెళ్ళాడు.

**ఈ పాఠం నన్నయ రాసిన శ్రీమదాంధ్ర మహాభారతంలోని ఆ పర్వం ్వతీయాశ్వాసం లోని .**

## 2. ఇల్లు - ఆనందాల హరివిలు

**2.** భారతదేశంలోని కుటుంబవ్యవస్థ పట్ల అంతర్జాతీయ సమాజం అనేక ప్రశంసలను కురిపించింది. ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిన మన కుటుంబవ్యవస్థ గొప్పతనాన్ని తలచుకుంటూ, దాన్ని కాపాడుకోవాలని తెలపడమే ఈ పాఠ్యభాగ ఉద్దేశం.

## 4. నీతి పరిమళాలు

**3.** శతకపద్యాలు సమాజం పోకడలను తెలుపుతాయి. మనిషి ఎలా జీవించాలో చెబుతాయి. వీటి ద్వారా విద్యార్థులలో నైతిక విలువల్ని పెంపొందించటమే ఈ పాఠం ఉద్దేశం.

**ఈ పాఠంలోని పద్యాలు వివిధ కవులు రాసిన శతకాల లోనివి.**

## 5. ప్రతిజ్ఞ

**4.** శ్రమైక జీవన సౌందర్యాన్ని ఆస్వాదించడం కష్టపడే వారి పట్ల గౌరవం కనబరచడం విద్యార్థులలో సామాజిక స్పృహను పెంపొందించడం ఈ పాఠ్యాంశ ప్రధానోద్దేశం.

**ఈ పాఠం శ్రీశ్రీ రాసిన 'మహాప్రస్థానం' లోనిది.**

## 6. అజంతా చిత్రాలు

**5.** భారతీయ చరిత్ర, సంస్కృతులను ప్రతిబింబించే ప్రాచీన కట్టడాలెన్నో అజ్ఞానం, నిర్లక్ష్యం, స్వార్థాల వల్ల పాడైపోతున్నాయి. వీటి ప్రాధాన్యాన్ని గుర్తించి పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకతను తెలియజేయడం ఈ పాఠం ఉద్దేశం.

**ప్రస్తుత పాఠ్యభాగం నార్ల వేంకటేశ్వరరావు రచించిన "నార్ల రచనలు" ఐదవ సంపుటి లోనిది.**

## 9. హరిశ్చంద్రుడు

**6.** ఒకసారి దేవేంద్రుడు కొలువుదీర్చి ఉన్నాడు. 'మూడులోకాలలో ఎవరైనా బొంకని వారున్నారా ? ఇప్పుడు జీవించి ఉన్న వారిలో కానీ, గతకాలం వారిలో కానీ అసత్యమాడని వారున్నారా ? భవిష్యత్తులో ఎవరైనా ఉంటారా ?' అని త్రికాలజ్ఞులైన మునీశ్వరులను అడిగాడు. ఎవ్వరూ మాట్లాడలేదు. కొంత మంది విన్నా విననట్లు ఊరుకున్నారు. కానీ వశిష్ఠుడూరుకోలేదు. హరిశ్చంద్రుడు అటువంటి ఉత్తమ లక్షణాలు కలవాడని సభలో ప్రకటించాడు. ఆ లక్షణాలు ఏమిటో ఈ పాఠం ద్వారా తెలుసుకుందాం.

***ప్రస్తుత పాఠ్యభాగం గౌరన రచించిన "హరిశ్చంద్రోపాఖ్యానము" లోనిది.***

## 11. జీవన భాష్యం

**7.** దుఃఖాన్ని తట్టుకుంటూ, కష్టాలను ఎదుర్కొంటూ, తనంతట తాను ఎదుగుతూ, ఇతరుల కోసం పాటుపడుతూ జీవించే మనిషి, సమాజంలో గౌరవం పొందుతాడని చెప్పడమే ఈ పాఠం ఉద్దేశం.

**ప్రస్తుత పాఠ్యభాగం 'డాక్టర్ సి. నారాయణరెడ్డి సమగ్ర సాహిత్యం ఆరవ సంపుటి'లోని "తెలుగు గజళ్ళు" లోనిది.**

## 13. సంస్కరణ

**8.** వార్తాపత్రికల్లోని సంపాదకీయాలు, వ్యాఖ్యలు సమాజ చైతన్యానికి తోడ్పడతాయి. కాబట్టి విద్యార్థుల్లో సంపాదకీయ వ్యాసాల పట్ల, వ్యాఖ్యల పట్ల అభిరుచి కలిగించాలనేది ఈ పాఠం ఉద్దేశం.

**ఈ పాఠం "నండూరి రామమోహనరావు "వ్యాఖ్యావళి" గ్రంథంలోనిది.**

## 14. సందేశం

**9.** భిన్న సంస్కృతులకు, సంప్రదాయాలకు నిలయమైనది మనదేశం. "భిన్నత్వంలో ఏకత్వం" సాధించి ప్రపంచ ప్రసిద్ధిని పొందిన మన దేశం గొప్పతనాన్ని, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యతను గురించీ తెలియజేయడమే ఈ పాఠం ఉద్దేశం.

**ఈ పాఠం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచారశాఖ వారు ప్రచురించిన 'సమైక్య భారతి' కవితా సంకలనంలోనిది.**

## 15. భూదానం

**10.** భూమి ప్రకృతిలో భాగం. అదీ అందరిదీ అని గుర్తించి భూమిని అందరికీ సమానంగా పంచడానికి 'భూదాన ఉద్యమం' చేపట్టారు వినోబా భావే. ఆ ఉద్యమంలో ఆయన పొందిన అనుభవాలను ఆయన మాటల్లోనే తెలుసుకొందాం.

# ప్రక్రియాలు

## 1. అమ్మకోసం

1. ఇది ఇలా జరిగింది అని చెప్పేది ఇతిహాసం. ఇతిహాసంలో కథకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. ఈ కథలు గ్రంథస్థం కాకముందు వాగ్రూపంలో ఉండేవి. రామాయణం, మహాభారతం మన భారతీయ ఇతిహాసాలు.

## 5. ప్రతిజ్ఞ

2. లయకు ప్రాధాన్యం ఇస్తూ మాత్రా ఛందస్సులో సాగే రచన గీతం. శ్రీశ్రీ మహాప్రస్థానంలోని ఖండికలన్నీ గీతాలుగా పేర్కొన్నారు.

## 6. అజంతా చిత్రాలు

3. రచయిత తాను చూసిన ప్రదేశాన్ని గురించి వర్ణించే రచనే యాత్రారచన. దీనిలో ఆ ప్రదేశం ప్రత్యేకత, ప్రకృతి రమణీయకత, చరిత్ర వంటి అంశాలుంటాయి. రచయిత ఆత్మాశ్రయ శైలిలో భావాలను తెలియజేస్తాడు.

## 9. హరిశ్చంద్రుడు

4. ద్విపద రెండు పాదాలు ఉన్న పద్యం. ఇది జాతి పద్యం. గానయోగ్యమైంది.

## 11. జీవన భాష్యం

5. ఉర్దూ సాహిత్య ప్రక్రియ 'గజల్'. దీంట్లో ఒకే విషయాన్ని చెప్పాలనే నిర్బంధం ఉండదు. గజల్‌లోని భావం ఏ చరణానికి ఆ చరణం విడిగా ఉంటుంది. కొన్ని సందర్భాలలో రెండు చరణాలు కలిసి ఒకే భావాన్ని వ్యక్తపరుస్తాయి. గజల్ పల్లవిని ఉర్దూలో 'మత్లా' అని, చివరి చరణాన్ని "మక్తా" అని అంటారు. పల్లవి చివర ఉన్న పదం, ప్రతి చరణం చివర అంత్యప్రాసను రూపొందిస్తుంది. చివరి చరణంలో కవి నామముద్ర ఉంటుంది. దీన్ని "తఖల్లస్" అంటారు. సరసభావన, చమత్కార ఖేలన, ఇంపూ, కుదింపూ గజల్ జీవగుణాలు.

## 13. సంస్కరణ

6. సమకాలీన సంఘటనలలో ముఖ్యమైన వాటిని తీసుకొని, పత్రికల్లో వ్యాఖ్యానరూపంగా పూర్వాపరాలను పరామర్శిస్తూ సాగే రచన సంపాదకీయ వ్యాసం. దీన్ని పత్రికా సంపాదకులు గానీ, ప్రత్యేక వ్యాసకర్తలు గానీ రాస్తూ ఉంటారు. తక్కువ మాటల్లో పాఠకులను ఆకట్టుకునేటట్లు, ఆలోచించేటట్లు చేయగలగడం మంచి సంపాదకీయ లక్షణం. ఇవి తత్కాలానికి సంబంధించినవే అయినా ఒక్కొక్క సందర్భంలో విభిన్న కాలాలకూ వర్తిస్తుంటాయి.